గురువుకు ఇష్టమైన రీతిలో జీవించటానికి ప్రయత్నం ప్రారంభించాలి. అప్పుడు ఏమిషమీద మనలను తన వద్దకు లాగేరో తెలుస్తుంది. విద్యార్థి దశనుండి వార్ధక్యం వరకు, మనకు సంతోషము, సుఖము కలిగించేవి, మన యిష్టమైనవి, ప్రసాదించమని సాయిని వేడుతాముగాని, తాత్కాలిక ఆనందం కాకుండా శాశ్వతానందాన్ని కలిగించే, సద్గురువుకు ఇష్టమైనదీ ప్రసాదించమని అడగము. మనము భావించే సంతోషకరమైనవన్నీ శ్రేయస్కరము కాకపోవచ్చు. కాని మన ఇష్టంతో సంబంధంలేకుండా సద్గురువు ప్రసాదించే ప్రతిదీ శ్రేయస్కరమైనది, మనకు శాశ్వతానందాన్ని ప్రసాదించేదే అవుతుంది. చిన్నపిల్లవాడికి తండ్రి గడ్డం గీసుకునే బ్లేడును చూసి ఆడుకోవాలని కోరుకోవటం, కావాలని పేచీ పెట్టటం, దానిని పొందటం సంతోషకరం, అయితే అది ఉపయోగించటము తెలియక, శరీరం తెగిన మరుక్షణం సంతోషం మటుమాయమై, ఆస్థానంలో అనుభవించే దు:ఖమే ఎక్కువగా ఉంటుంది. మనం కోరుకునేవన్నీ ఆవిధంగా ఉంటాయి. మందురాసుకొని, తెగిన చేతికి కట్టుకట్టుకొని, ఇష్టంలేని మాత్ర మింగటం పిల్లవాడికి ఇష్టంఉండదు గాని, అతని ఇష్టాన్ని పక్కన పెట్టి తండ్రి బలవంంగా చేసే పరిచర్యవల్ల, బాధ తగ్గి గాయం నయమవ్వటం ద్వారా పిల్లవాడు పొందే ఆనందం శాశ్వతం. సద్గురువు చేసేపని అట్లా ఉంటుంది. కనుక సద్గురువు చెంతకు చేరినప్పుడు తాత్కాలికము, అశాశ్వతము అయిన సుఖము, సంతోషం ఆనందం ప్రసాదించమని కోరటంకన్నా, శాశ్వతానందాన్ని కలిగించే శ్రేయస్కరమైన దానిని ప్రసాదించమని కోరగలగాలి, అట్లా కోరగలగాలి అంటే మనము సద్గురువు చెంతకు ఎందుకు చేరేమో తెలుసుకోవాలి. అందుకు అవరోధమైన ఇష్టా అయిష్టాలను జయించగలగాలి. దానికి సంబంధించి సాయిసన్నిధిలో జరిగిన ఒక సంఘటన ఇక్కడ ప్రస్తావించుకుందాము.

ఒకసారి ఒక భక్తుడు బాబా వద్దకువచ్చి తమ కుమార్తెకి ఒక ఉత్తమమైన సంబంధం వచ్చిందని మీరు ఆశీర్వదిస్తే వారికి వివాహం జరిపిస్తానని కోరేడు. అందుకు బాబా "అతను ఉద్యోగస్తుడనా వివాహం చేయటం అంతకంటే మనకు దగ్గరలోనే ఉన్న అప్పా అనే వంటవాడికి ఇచ్చి చేయండి. ఇద్దరు సుఖసంతోషాలతో జీవితం గడుపుతారు" అని అన్నారు. అయితే తమ బంధువులకు అందరికీ యిష్టమైన, తనకూ అనుకూలమైన, తాము కోరుకున్న సంబంధాన్ని బాబా స్థిరపరిస్తే, కష్టాలు, బాధలు తొలగి వారు సుఖపడతారు కనుక బాబా చెప్పిన సంబంధం గురించి కాక, తమకు యిష్టమైన ఉద్యోగస్తుడి సంబంధం గూర్చి మరల బాబాదగ్గర ప్రస్తావించి, "అది కాదు బాబా, అమ్మాయి చదువుకుంది, కొద్దో గొప్పో ఆస్థిపాస్తులు కూడా ఉన్నాయి. అవతల వ్యక్తి చదువుకున్నాడు, ఉద్యోగస్తుడు. ఆస్తిపాస్తులు కలవాడు అందువలన అమ్మాయి అన్నిరకాల సుఖపడుతుంది కనుక నీవు అనుమతిస్తే ఆ సంబంధం స్థిరపరచుకోదలచాము కనుక నీ అనుమతివ్వమని తన ఇష్టాన్ని మరొకసారి బాబా ముందు వెల్లడిచేశారు. అందుకు బాబా చిరునవ్వు నవ్వుతూ, "మీరు అనుకున్నది కాక, అప్పా అనే నేను చెప్పిన వంటవాడికి ఇచ్చి చేయండి ఉభయులకు శ్రేయస్కరమవుతుంది" అన్నారు. తమకు ఇష్టంలేని ఆ సంబంధంగురించే మరల బాబా ప్రస్తావించటం చూసి బాబా, భక్తుల మధ్య ఉండి మనల్ని పరీక్షించటానికి అట్లా అని ఉంటారు, మరొక్కసారి ఏకాంతంగా అడగాలి అని అనుకొని మరల ఇంకొకసారి బాబా ముందు తమ ఇష్టాన్ని వెల్లడిచేశారు వారు. అందుకు బాబా చిద్విలాసంతో నేను ఫకీరును మీరు గృహస్తులు, అంతలోతుగా ఆలోచించి, అంతమంచిది అని మీరు అనుకుంటే మీరనుకున్నటే కానివ్వండి" అని అన్నారు. అమ్మయ్య ఇప్పటికి మనం చెప్పింది బాబాకు పూర్తిగా అర్థమయ్యింది, ఆశీర్వదించారు అనుకొని, తమ ఇష్టప్రకారము వివాహము జరిపించారు.

కొద్దినెలలలో అతను చనిపోగా ఇంటికి తిరిగివచ్చిన కుమార్తెను చూసి, "ఒకటికి రెండుసార్లు హెచ్చరిస్తాను వినకపోతే మీమానాన మిమ్మల్ని వదలివేస్తాను" అన్న సాయి మాట మరచి, బాబాను నిందించి, దూరమయ్యారు వారు. మనము కూడ అలానే చేస్తున్నామా! ఇంటి నిర్మాణము గురించో మరొక దానిగురించో లేక ఒక స్థలము కొనదలచి, అంతడబ్బు పెట్టి అది కొనటము వలన భవిషత్తులో మనకు మంచిదా లేక చెడా తెలియక అనేక విధాలుగా అనేకచోట్ల విచారించి, సంశయములో పడి దానిపట్ల మక్కువ వీడలేక చివరిగా, సాయి సందేశము ప్రకారము నడచుకోవాలని నిర్ణయించుకొని, దానికి, ఆలంబనగా చీట్లువేసి దానిలో "తీసుకో" అనివస్తే ఇక వేరే ఆలోచనలేక తీసుకోవడమే, "వద్దు" అని వస్తే రెండో ఆలోచనలేక విరమించుకోవటమే అని నిర్ణయించుకొని బాబా చిత్రపటం ముందు రెండు చీట్లువేసి చిన్నపిల్లవాడు దైవస్వరూపం కనుక వాడి చేత చీటీ తీయిస్తాము. ముందు ఒకటి తాకబోయి రెండో చీటి తీసిఇస్తాడు ఆ బాలుడు. అందులో "వద్దు" అని ఉంటుంది. నేను ఎంతో ఆలోచించికదా ముందుకు అడుగువేసింది. అటువంటిది బాబా వద్దనడే, పిల్లవాడు ముందుముట్టుకోబోయిందే బాబా నిర్ణయం, "వద్దు" అన్నచీటీ తీశాడు కనుక బాబా నిర్ణయం అదికాదు అని మనయిష్టాన్ని దానిపై రుద్ది, పిల్లవాడు కాదు, ఒక పెద్దమనిషిచేత తీయిద్దాము, అది సరియైనది అనుకొని రెండవసారి ఒక